క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన కీర్తి రైనా

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నగరం గ్రామానికి చెందిన నేత బళ్ల కీర్తి రైనా బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసినట్టు రైనా తెలిపారు. పార్టీలో కష్టపడి పని చేయాలని జగన్ సూచించారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని ఆయన ఆదేశించారన్నారు. వైఎస్సార్ సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుక కృషి చేయాలని చెప్పారన్నారు. జగన్ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు.

నూకాంబిక ఆలయంలో హుండీల లెక్కింపు



చింతలూరులో నూకాంబిక అమ్మవారికి విరాళం అందజేస్తున్న దాతలు

ఆలమూరు: చింతలూరులో వేంచేసియున్న నూకాంబిక అమ్మవారికి హుండీల ద్వారా రూ 5.17 లక్షల కానుకలు లభించాయని ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో బుధవారం రెండు హుండీలు లెక్కించారు. పది నెలల కాలానికి రెండు హుండీల ద్వారా ఈ కానుకలు లభించినట్లు ఈఓ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు, సిబ్బందితో పాటు మహిళ భక్త బృందం పాల్గొన్నారు. 2025 వార్షిక జాతర మహోత్సవాలకు సంబంధించి ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ వీర్రాజు చౌదరి తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మ వారి ఆలయ అభివృద్ధికి దాతలు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలమూరుకు చెందిన పారిశ్రామికవేత్త వంటిపల్లి కాశీ విశ్వనాథం,అన్నపూర్ణ దంపతులు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి వారు రూ.లక్ష విరాళాన్ని ఈఓకు అందజేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ వంటిపల్లి సతీష్, కమిటీ మాజీ చైర్మన్లు వైట్ల శేషు బాబు, దొమ్మేటి రామకృష్ణ పాల్గొన్నారు.

చెత్త సమస్యకు పరిష్కారమెప్పుడు?

- డంపింగ్ యార్డు లేక ఇక్కట్లు
- మరుగున పడిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం
- వేప చెట్టు డ్రెయిన్‌లోనికి చేరుతున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు
- కాలుష్యం బారిన ప్రజలు



మలికిపురంలో వేప చెట్టు డ్రెయిన్ గట్టుపైనే చెత్త వేస్తున్న దృశ్యం

మలికిపురం: మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు ప్రధాన వ్యాపార కూడలిగా మారిన మలికిపురం గ్రామానికి కొన్నేళ్లుగా నెలకొన్న డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం లభించడం లేదు. కొన్ని దశాబ్దాలుగా అనేక వివాదాలతో పాటు ప్రధానంగా స్థల సమస్య వల్ల డంపింగ్ యార్డు ఏర్పాటు పంచాయతీ పాలక వర్గాలకు పెను సవాల్‌గా మారింది. సుమారు ఐదేళ్ల క్రితం వరకూ గ్రామంలోని సత్యజ్యోతి థియేటర్ వద్ద వేప చెట్టు డ్రెయిన్‌తో పాటు, గుడిమెళ్లంక వంతెన వద్ద కూడా చెత్తను పంచాయతీ కార్మికులు డంప్ చేసేవారు. డ్రెయినేజీ శాఖ నుంచి అభ్యంతరం రావడంతో నాలుగేళ్ల క్రితం పంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులు చెత్తను భూపతి వారి పేట సమీపంలో ఏటిగట్టు పక్కన వేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తను ఏటిగట్టు పక్కన వేయడంతో గ్రామస్తులు, సరిహద్దు స్థలాల యజమానులు అప్పట్లో గొడవ చేశారు. పేరుకుపోయిన చెత్తను మండించడంతో ప్రమాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పలుమార్లు ఇక్కడ భారీ ఎత్తున మంటలు చెలరేగి ప్రమాదం సంభవించింది. తరచూ పెద్ద ఎత్తును మంటలు చెలరేగడంతో చుట్టు పక్కల నివాస గృహాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ వారే తరచూ ఇక్కడి చెత్తను దహనం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో గత్యంతరం లేక మలికిపురంలో మార్కెట్‌నే డంపింగ్ యార్డుగా వినియోగించారు. అక్కడ కూడా ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అప్పటి ప్రజా ప్రతినిధుల చొరవతో సముద్రం వద్దకు కొంత కాలం చెత్తను తరలించారు. ఇది ఖర్చుతో కూడినది కావడంతోపాటు అక్కడి రైతుల కూడా అభ్యంతరాలు తెలపడంతో చెత్త సమస్య మరలా మొదటికి వచ్చింది.

పూడుకుపోతున్న డ్రెయిన్

ప్రస్తుతం మలికిపురంతో పాటుచుట్టు పక్కల గ్రామాల చెత్త అంతా తిరిగి మలికిపురంలోని వేప చెట్టు డ్రెయిన్‌లోనే పడుతోంది. ఇటు డ్రెయిన్ పూడుకుపోయి మురుగు కిందికి దిగడం లేదు. చెత్త వల్ల డ్రెయిన్ పొడవునా దుర్గంధం వెదజల్లుతోంది. విష జ్వరాలతో పాటు అంటువ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తల పట్టుకున్న పంచాయతీ పాలకవర్గం ఏడాదిగా డంపింగ్ యార్డు స్థలం కోసం చేయని ప్రయత్నం లేదు. పాలకవర్గం గడువు దగ్గర పడుతున్నా. డంపింగ్ యార్డు సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు.

పేరుకుపోతున్న టన్నుల కొద్దీ చెత్త

మలికిపురం వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతోంది. ఆదివారం మార్కెట్‌తో పాటు, డైలీ మార్కెట్ కూడా నిత్యం రద్దీగా ఉంటుంది. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ప్రజలు అధికంగా మార్కెట్‌కు వస్తుంటారు. కాయగూరలు, చేపలు, మాంసం విక్రయాలు అధికంగా సాగుతాయి. ప్రధాన కూడలి రోడ్ల వెంబడి వివిధ దుకాణాలున్నాయి. సినిమా థియేటర్లు, విద్యా సంస్థలు ఉన్నాయి. దీంతో చెత్త అధికంగా వస్తోంది. వాహనాల ద్వారా ప్రతి రోజూ పారిశుధ్య కార్మికులు టన్నుల కొలదీ చెత్తను తరలిస్తున్నారు. ఆ చెత్త వేసేందుకు స్థలం మాత్రం నేటికీ ఏర్పాటు కాలేదు. స్థల సేకరణ కూడా పంచాయతీకి కత్తిమీద సాములా మారింది. మలికిపురం గ్రామం విస్తీర్ణం పరంగా చిన్నది. కొనుగోలు చేద్దామన్నా ఖాళీ స్థలాలు అందుబాటులో లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు కూడా మూలన పడడంతో చెత్త సమస్య తీవ్రమవుతోంది. డంపింగ్ ఏర్పాటుకు పూర్తి స్థాయిలో ముందుకు వెళదామన్నా పంచాయతీకి నిధుల కొరత ఉంది. రూ. కోట్లతో స్థల సేకరణ పంచాయతీకి సాధ్యం కాని పని. యార్డు ఏర్పాటులో జిల్లా పరిషత్, తదితర ఇతర ప్రభుత్వం శాఖల నుంచి సహకారం ఏమాత్రం లభించడం లేదు.

> **డంపింగ్ యార్డుకు కృషి చేస్తున్నాం**
>
> 
>
> డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాం. మలికిపురంలో స్థల అందుబాటులో లేకపోవడంతో కొన్ని గ్రామాలకు కలిపి రామరాజులంకలో స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు. త్వరలోనే పరిష్కారం లభిస్తుంది.
>
> – గెడ్డం రాజ్యలక్ష్మి, సర్పంచ్, మలికిపురం

కూటమి పాలన వైఫల్యాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పనిచేయాలని అపార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ అధ్యక్షతన తొత్తరమూడి వీవర్స్ కమ్యూనిటీ భవనంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, సీనియర్ పార్టీ నాయకులు మందపాటి కిరణ్‌కుమార్ హాజరయ్యారు. కూటమి పాలనలో వైఫల్యాలను రాష్ట్ర ప్రజలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని వారన్నారు. జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్‌నారాయణ, నాయకులు కుడుపూడి భరత్, చెట్ల రామారావు, వాసంశెట్టి తాతాజీ, మిండగుదిట రాంబాబు, కనుమూరి సత్యనారాయణరాజు, బడుగు దుర్గాదేవి, కుడుపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయం విధులు మాత్రమే నిర్వహిస్తాం



నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వర్ణలతకు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు

మామిడికుదురు: ఒక వైపు సచివాలయ శాఖ విధులు, మరొక వైపు వైద్య ఆరోగ్య శాఖ విధులతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామంటూ సచివాలయ ఏఎన్‌ఎంలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. తమను ఏదో ఒక శాఖకు పరిమితం చేయాలని వారు కోరారు. దీనిపై నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. లూటుకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్‌ఎంలు కూడా అక్కడి వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఒకే సమయంలో రెండు శాఖలకు చెందిన విధులు నిర్వహించడం తమకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. పనిభారం పెరిగిపోయి, అనారోగ్యం బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయానికి చెందిన సర్వేలు చేయాలని, లేని పక్షంలో జీతాలు నిలిపి వేస్తామంటూ మండల పరిషత్ అధికారులు తమపై ఒత్తిడి తీసుకు రావడం వల్ల తీవ్ర మానసిక ఇబ్బందులు పడుతున్నామని వారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాము సచివాలయానికి చెందిన విధులు మాత్రమే నిర్వహిస్తామని, ప్రజలకు అత్యవసరమైన వైద్య ఆరోగ్య శాఖకు చెందిన సేవలు మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రికార్డు వర్కు నిర్వహించే పరిస్థితి లేదన్నారు. దీనికి పీహెచ్‌సీ వైద్యులు, సూపర్‌వైజర్లు సహకరించాలని వినతిపత్రంలో కోరారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కొత్తపేటలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రావులపాలెంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: ఆత్రేయపురంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఆలయ నిర్మాణ దాత పాతపాటి రమణరాజు, రాజ్యలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఉదయం స్వామి వారికి పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ఖండవల్లి సూర్యనారాయణచార్యులు, ఎస్.సూర్య పురుషోత్తమ సాయి పర్యవేక్షణలో వేదపండితుల బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా ప్రారంభించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. స్వామి వారిని శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ నిర్మాణ దాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణ రాజు), పాతపాటి రామాంజనేయరాజు, లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు గోరింట వినయ్‌కుమార్ వర్మ, పాకలపాటి వెంకట సత్యనారయణరాజు పర్యవేక్షించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రావులపాలెం: స్థానిక అలివేలు మంగా పద్మావతి అండాల్ సహిత వేంకటేశ్వర స్వామి 16వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి బుధవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మార్చి 17 తేదీ సోమవారం వరకూ ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు స్వామివారికి రెండు వాహనోత్సవం, పూజలు కొనసాగుతాయన్నారు. బుధవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా స్వామి అమ్మవార్లను పెళ్లి కుమారుడిగా, పెళ్లి కుమార్తెగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

పెద్దింట్లమ్మ గుడి తలుపులు తెరవకపోవడంపై భక్తుల ఆగ్రహం



కేశవదాసుపాలెంలో మూసి ఉన్న పెద్దింట్లమ్మ ఆలయ తలుపులు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మ గుడి తలుపులు తెరిచి అమ్మవారి దర్శనం కల్పించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ పూర్వ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధి తాళాలను ఆలయ పూజారి నుంచి తీసుకుని వెళ్లిపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. బుధవారం వేకువ జామున నుంచి మధ్యాహ్నం వరకూ అమ్మవారి దర్శనం దక్కక భక్తులు నిరాశతో వెనుతిరిగారు. గత నెల 28 నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ ఉత్సవాలను ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశాలపై గత నెల 24న అమ్మవారి ఆలయాన్ని ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు, అంతర్వేది ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, మండల ఆర్ఐ రామరాజు సందర్శించారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు ఆలయ పరిధిలోని రెండు వర్గాలు మధ్య విభేదాలు ఉండడంతో అప్పట్లో ముందస్తు జాగ్రత్తలపై ఉన్నతాధికారులు పలు అంశాలపై ఆదేశాలిచ్చారు. ఉత్సవాలు జరుగుచుండగా మంగళవారం రాత్రి ఆలయ పూజారి యు.గంగాధర్ దగ్గర ఉన్న తాళాలను పూర్వ మేనేజ్‌మెంట్ కమిటీ మాజీ ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ తీసుకుని వెళ్లినందుకు, అంతర్వేది ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై రంగంలోకి దిగిన అధికారులు ఆలయ గుడి తలుపులను బలవంతంగా తెరిచి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి భక్తులకు యథాతథంగా అమ్మవారి దర్శనం కల్పించారు.

అవార్డు గ్రహీతల సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లను అభినందిస్తున్న డీపీటీఓ శ్రీనివాస్

రావులపాలెం: అవార్డులు పొందిన ఆదర్శ ఉద్యోగులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి (డీపీటీఓ) ఎం.శ్రీనివాస్ అన్నారు. రావులపాలెం ఆర్టీసీ డిపోలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ బుధవారం నిర్వహించారు. డిపో మేనేజర్ జీజీవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీటీఓ ఎం.శ్రీనివాస్ హాజరై ఉత్తమ ప్రదర్శన కనబరిచిన సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో కృషి చేసి డిపో అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సంస్థకు అధిక ఆదాయం తీసుకొచ్చిన ముగ్గురు కండక్టర్లకు, కేఎంపీఎల్‌లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు డ్రైవర్లకు నగదు అవార్డులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఆరుగురు గ్యారేజి సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. రావులపాలెం డిపో నుంచి కుంభమేళాకు బస్సులు నడిపిన, తొమ్మిది ప్రత్యేక బస్సులకు రూ.30 లక్షల ఆదాయం తీసుకొచ్చిన 14 మంది డ్రైవర్లను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలి

కొత్తపేట: నేటి సమాజంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళ వారోత్సవాల సందర్భంగా స్థానిక విశ్వకవి వేమన డిగ్రీ కాలేజీలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బాల్యవాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ఆడపిల్లలు తమ వంతు పాత్రను పోషించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అరుణ, నాగేశ్వరరావు, ఐశయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు చంద్రకళ, సుల్తానా బేగం, నాగమణి పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను నిరోధించాలి

మామిడికుదురు: పెదపట్నంలంకలోని గోదావరి నదీ తీరంలో మట్టి తవ్వకాల వల్ల తమ భూములు కోతకు గురయ్యే అవకాశం ఉందని అదే గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం ఎమ్మార్వో సుబ్రహ్మణ్యం ఆచార్యులుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి తమ సరిహద్దులోని భూమిలో భారీగా మట్టి తవ్వకాలు నిర్వహించారన్నారు. దీని వల్ల తీరంలోని తమ భూములకు రక్షణ కొరవడిందన్నారు. దీనిపై విచారణ జరిపించి, అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించాలని, మట్టి తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా..

రక్త పరీక్షల కేంద్రాల్లో నాణ్యతకు తిలోదకాలు

మలికిపురం: రక్త పరీక్షల కేంద్రాల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారని జిల్లా వినియోగదారుల సంక్షేమ సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస్ నగేష్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రక్త పరీక్షా కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని నిబంధనలకు, పరీక్షల నాణ్యతలకు తిలోదకాలిస్తున్నారని కొన్ని కేంద్రాల్లో సరైన ప్రమాణాలతో ఫలితాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కొంతమంది స్థానిక వైద్యులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారని విమర్శించారు. వైద్యులు కమిషన్లకు కక్కుర్తి పడి టెస్ట్‌లు రాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని పరీక్ష కేంద్రాల్లో అర్హత లేని వారితో పరీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని, రెన్యువల్ కాని ల్యాబ్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలని నగేష్ డిమాండ్ చేశారు.

13న మొల్లబాంబ జయంత్యుత్సవం

అంబాజీపేట: ఈ నెల 13న ఆతుకూరి మొల్లమాంబ జయంత్యుత్సవాన్ని మాచవరం కుమ్మరి శాలివాహన సంఘ భవనంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సంఘ నాయకులు ఆదుర్తి నారాయణమూర్తి బుధవారం తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘ అధ్యక్షుడు మానేపల్లి బ్రహ్మం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

తరపట్ల కుటుంబానికి జెడ్పీ చైర్మన్ పరామర్శ

అంబాజీపేట: ఇటీవల ఇసుకపూడిలో సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు సోదరుడు రాజారావు కుమార్తె అకాల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం పరామర్శించారు. కాశి ఆనంద పుష్పవల్లి చిత్ర పటం వద్ద ఘన నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. జెడ్పీ చైర్మన్‌తో పాటు కుసుమ ఆనందరాజు, నేలపూడి జాన్, తరపట్ల రాంబాబు, గిరి, చిల్లే ధనరాజ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆటపాటలతో బోధించాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చిన్నారులను చైతన్యవంతం చేయాలని ఎంపీడీఓ ఏ రాజు, కొత్తపేట సీడీపీఓ గజలక్ష్మి అన్నారు. మండలంలోని బడుగువానిలంకలో బాల ఆరంభ దశ (ఈసీసీఐ) బుధవారం ప్రారంభమైంది. అంగన్‌వాడీ చిన్నారులను ప్రీస్కూల్లో చేర్పించేందుకు సన్నద్ధం చేసేందుకు ఈసీసీఐ దోహదపడుతుందని వారన్నారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్.వెంకటరెడ్డి, సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, అరుంధతి పాల్గొన్నారు.

10 నుంచి సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాలు

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువు తీరిన అనంతలక్ష్మీ, భూదేవి సమేత సత్యనారాయణస్వామి 73వ వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. 10న ఏకాదశి సోమవారం ఉదయం వ్రతాలు, అభిషేకాలతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలు 14వ తేదీ శుక్రవారం వరకు అయిదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు కమిటీ పేర్కొంది. 10వ తేదీ రాత్రి 12 గంటలకు గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలు జరిగే అయిదు రోజులు ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు కొనసాగే అయిదు రోజులు వరుసగా వివిధ వాహనాలపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం టీకాలు

ఆలమూరు: నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు సువర్చలాదేవి, డి.సాయికిషోర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్ హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్. బాలమణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పలు గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు.

ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలి

అంబాజీపేట: పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ క్రమం తప్పకుండా వేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట, మాచవరం–1, తొండవరంలో నిర్వహిస్తున్న యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి నెల చిన్నారులకు వేసే టీకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాక్సిన్ వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. అనంతరం అడవర్స్ ఈవెంట్ ఫాలోయింగ్ ఇమ్యునైజేషన్ (ఏఈఎఫ్ఐ) కిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కె.ఎన్.శ్రీనివాస్, సీహెచ్ఓ బి.అప్పారావు, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

విధుల నుంచి ఫీల్డు అసిస్టెంట్ తొలగింపు

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేసిన సరెళ్ల సుబ్బరాజుపై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో అతడిని శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ డ్వామా పీడీ మధుసూధన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ కె.విజయప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. సుబ్బరాజుపై వచ్చిన ఆరోపణలపై గతేడాది అధికారులు విచారణ నిర్వహించిన విషయం విదితమే.

వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న గుజరాత్ భక్త బృందం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్నను బుధవారం గుజరాత్‌కు చెందిన సుమారు 30 మంది భక్త బృందం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ సందడి చేశారు.